


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## రిజెక్టెడ్

**ఆఫీస్ నించి** ఇంటికి వచ్చిన ప్రమోద్, హాల్లో కూర్చుని టివి చూస్తున్న వాళ్ళని చూసి చిరాగ్గా బెడ్రూంలోకి వెళ్ళిపోయాడు.

మంచి నీళ్ళ గ్లాస్‌తో వచ్చిన నీరజని అదే చిరాకుతో అడిగాడు.

"వీళ్ళెందుకు వచ్చారు?"

"ఏమో? ఎందుకొచ్చారని అడగలేంగా."

"అడుగు. ఎప్పుడు వెళ్తారో కూడా అడుగు."

నీరజ మృదువుగా నవ్వి చెప్పింది.

"వాళ్ళు మీ పేరెంట్స్. అలా మాట్లాడకూడదు."

"వాళ్ళు నా పేరెంట్స్ కాదని నీకు బాగా తెలుసు" ప్రమోద్ కటువుగా చెప్పాడు. నీరజ నొచ్చుకున్నట్లు చూసి నిశ్శబ్దంగా బయటకి వెళ్ళిపోయింది.

"ప్రసన్నా.. బావున్నావా?" భోజనాల దగ్గర తల్లి పలకరించింది.

"నా పేరు ప్రమోద్" కటువుగా చెప్పాడు.

"ఏదొకటిలే. డుంబు కొడుకు స్కూల్లో ఏదో నాటకం వేస్తున్నాట్ట. చూడ్డానికి రమ్మంటే నేనూ నాన్న వచ్చాం. రేపొద్దున్నే డుంబు ఇంటికి వెళ్తాం" ఆవిడ చెప్పింది.

"సరే."

కొడుకు ధోరణి తెలుసన్నట్లుగా ఆయన తలవంచి అన్నం తినడంలో నిమగ్నమయ్యాడు తప్ప సంభాషణలో పాలు పంచుకోలేదు.

"ఒరే ప్రసన్నా రేపటినించి నువ్వు జయరాం అంకుల్ ఇంట్లో ఉండాలి." తండ్రి చెప్పాడు.

"ఎందుకుండాలి?" ఆరేళ్ళ ప్రసన్న అర్థంకాక అడిగాడు.

"అంటే జయరాం అంకుల్‌కి పిల్లలు లేరు కదా? పాపం నిన్ను వాళ్ళింటికి పంపించమన్నాడు" తల్లి అనునయంగా చెప్పింది.

"నేను వెళ్ళను" చెప్పి ప్రసన్న ఆటలో మునిగిపోయాడు.

మర్నాడు తనని తీసుకెళ్ళడానికి స్కూల్‌కి జయరాం వస్తే భయంగా చెప్పాడు. "మా అమ్మ వస్తుంది అంకుల్."

"రాదు. అమ్మ అన్నని తీసుకుని ఇంటికి వెళ్ళిపోయింది" ఆయన చెప్పాడు.

ప్రసన్నకి మోసపోయిన భావన కలిగింది. అమ్మ స్కూల్‌కి వచ్చి అన్నని తీసుకుని, తనని వదిలేసి వెళ్ళిందా?

మౌనంగా జయరాం వెనక కారెక్కాడు. కారు దిగి వస్తున్న ప్రసన్నని చూసి సుమతి ఆనందంగా ఎదురెళ్ళి వాడిముందు మోకాళ్ళ మీద కూర్చుని చెప్పింది.

"వచ్చావురా కన్నా. నేను కూడా మీ అమ్మనే. రా"

వాడు వింతగా చూసాడు. వాడికేం అర్థం కావడంలేదు. చీకటి పడ్డాక అమ్మ వచ్చి తీసుకెళ్తుందని ఎదురుచూసాడు. రాలేదు. సుమతి ఇచ్చిన బిస్కెట్స్ తిని పాలు తాగాడు. కొద్దిసేపు ఆడుకున్నాడు.

"ఇంక స్నానం చేసి, అన్నం తినేసి పడుకుందామా?" సుమతి అడిగింది.

"అమ్మ... అమ్మ వస్తుంది" పిరికిగా చెప్పాడు.

"ఇవాల్టినించి నేనే మీ అమ్మని" సుమతి వాడిని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటూ చెప్పింది.

వాడిలో అప్పటిదాకా అణచిపెట్టుకున్న దుఃఖం ఒక్కసారిగా పెల్లుబుకింది. పెద్దగా ఏడుస్తూ ఆమె చేతుల్లోంచి జారిపోయాడు.

పిల్లల పెంపకంలో అనుభవం లేని సుమతి కంగారుపడి వంటావిడని పిలిచింది. ఆవిడ వాడిని అనునయించి స్నానం చేయించి అన్నం పెట్టి నిద్రపుచ్చింది.

మర్నాడు స్కూల్‌లో అన్న క్లాస్‌లోకి వెళ్ళి అన్నయ్యని కౌగలించుకుని ఏడ్చాడు.

క్లాస్ టీచర్ రావడంతో 'లంచ్‌లో కలుద్దాం వెళ్ళు' అని డుంబు సముదాయించి పంపాడు. లంచ్ టైంలో చెప్పాడు.

"నువ్వు అక్కడే ఉండాల్రా. రాత్రి నువ్వు ఇంట్లో లేవు కదా? నేను, చిన్నూ భలే ఆడుకున్నాం లే"

"నాకోసం అమ్మ ఏడవలేదా?"

"లేదు. నేనూ చిన్నూ గొడవచేయకుండా ఆడుకున్నాం అంది. ఇద్దరికీ మంచం కూడా హాయిగా ఉందిలే. నేనీ చివర, వాడా చివర."

ఆ మాటలకి ప్రసన్న లేత హృదయం గాయపడింది. తను అమ్మ కోసం నిన్న అంత ఏడ్చాడు. అమ్మ తన కోసం ఏడవలేదు. అన్న బాగా ఆడాడని మెచ్చుకుంది.

ఆ సాయంత్రం జయరాం వెంట వాళ్ళింటికి వెళ్ళాడు. సుమతి చెప్పేవన్నీ అర్థమైనా కాకపోయినా విన్నాడు. పెట్టింది తిన్నాడు.

ఆ పసివాడిలోని వయసుకి మించిన గాంభీర్యానికి జయరాం చలించాడు. ఆ రాత్రి వాడిని జోకొడుతూ చెప్పాడు.

''నాకు పిల్లలు లేరుగా. నీ పిల్లల్లో ఒకడినివ్వు. ప్రేమగా పెంచుకుంటా అని మీ నాన్నని అడిగాను. వాళ్ళు నిన్నిచ్చారు. నేనే మీ నాన్నని అనుకో.''

''నువ్వు డుంబుని తీసుకోవచ్చుగా? చిన్నుని తీసుకోవచ్చుగా?'' ప్రసన్న దుఃఖంగా అడిగాడు.

''డుంబూ పెద్దవాడు కదా? వద్దనుకున్నా. చిన్నూనే ఇమ్మన్నాను. కానీ మీ అమ్మ వాడిని వదిలి ఉండలేనంది. దాంతో మీ నాన్న ప్రస్సుని తీసుకో అన్నాడు.''

'అమ్మ చిన్నుని ఇవ్వమంటే ఇవ్వలేదు. తనని ఇచ్చేస్తానంటే ఒప్పుకుంది. అన్న యదార్థం వాడి మనసులో ఇంకేసరికి ప్రసన్న గుండె కఠినమైపోయింది. 'అమ్మ తనని చూడడానికి ఎప్పుడూ రాకపోవడంతో కోపం వచ్చింది. స్కూల్లో డుంబు రోజూ ఇంటిదగ్గర జరిగిన విశేషాలు, తమ్ముడితో ఆడుకున్న సంగతులు, అమ్మా నాన్న ముచ్చట్లు చెప్తూంటే, ఉక్రోషంగా వినేవాడు. ఒక్కోసారి అక్కడ్నించి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయేవాడు.

జయరాంకి మద్రాస్‌కి ట్రాన్స్‌ఫర్ అవడంతో అక్కడికి వెళ్ళిపోయారు. ప్రసన్న పేరు అమ్మాయి పేరులా ఉందని సుమతి దాన్ని ప్రమోద్‌గా మార్చి వాడిని స్కూల్లో చేర్చింది. తల్లిదండ్రులుగా తమపేర్లు రాసింది. ప్రమోద్ వాళ్ళని మమ్మీ, డాడీ అని పిలవడం అలవాటు చేసుకున్నాడు.

పరాయింట్లో ఉన్నానన్న భావన వల్ల వాడిలోని పసిదనం వాడిపోయింది. పెట్టింది తినేవాడు. బుద్ధిగా చదువుకునేవాడు. అల్లరి చేసేవాడు కాదు. తనకి ఏం కావాలన్నా అడిగేవాడు కాదు. మొహమాటం సిగ్గు. వాడిలోని మార్పులని గమనిస్తున్న జయరాం వాడ్ని తల్లితండ్రులనించి విడదీసి పాపం చేసానేమో అనుకునేవాడు.

టెన్త్ క్లాస్ ఫస్ట్‌క్లాస్‌లో పాసైన రోజు వాడు జయరాంని అడిగాడు.

''నన్ను ఇచ్చినందుకు మీరు వాళ్ళకి ఎంత డబ్బిచ్చారు?''

జయరాంకి ఒక్క క్షణం ఆ ప్రశ్న అర్థంకాలేదు. అయ్యాక చెప్పాడు.

''ఛఛ! మీ నాన్న నా ఫ్రెండ్ నాకు పిల్లలు లేరనే జాలితో నిన్ను దత్తత ఇచ్చాడు. అంతే. మా మధ్య డబ్బు ప్రసక్తే రాలేదు.''

''వాళ్ళు బాగా పేదవాళ్ళా?ఒక్క బిడ్డయినా సుఖపడ్తాడు. ఈ దరిద్రంలో ముగ్గుర్ని పెంచలేం అని ఇచ్చారా?''

''లేదు. మీ నాన్నది మంచి ఉద్యోగమే. మీ అమ్మకూడా జాబ్ చేస్తుంది. వాళ్ళకి ఎలాంటి ఆర్థిక బాధలు లేవు. ఎందుకు ఇవన్నీ అడుగుతున్నావు? మేము నిన్ను బాగా చూసుకోవడంలేదా?'' జయరాం బాధగా అడిగాడు.

''నన్నిచ్చాక వాళ్ళు మిమ్మల్ని నా గురించి అడిగారా?'' ప్రమోద్ ఆ ప్రశ్నని పట్టించుకోకుండా అడిగాడు.

''ఆ!c! మీ నాన్న నా ఫ్రెండే అని చెప్పాగా. అప్పుడప్పుడూ అడుగుతూంటాడు. ఇప్పుడే నువ్వు పాసయ్యావని ఫోన్ చేసాను.''

''అప్పుడప్పుడూనా? సరే. డేడ్ థాంక్స్'' ప్రమోద్ అక్కడినించి వెళ్ళిపోయాడు.

కాలేజ్ రోజుల్లో తన క్లాస్‌మేట్‌ని గాఢంగా ప్రేమించిన ప్రమోద్, జయరాం నీరజని పెళ్ళిచేసుకోమని చెప్పగానే, మారు మాట్లాడకుండా ఒప్పుకున్నాడు.

తన జీవితం తనదికాదు. తనని పెంచి పెద్ద చేసిన వాళ్ళకి తను రుణపడిపోయాడు అనే భావనలో ఉన్న ప్రమోద్ వారి ఇష్టానుసారమే నడుచుకున్నాడు.

చిన్న అనారోగ్యంతోనే సుమతి మరణించినప్పుడు కన్నకొడుకులా యధావిధిన కర్మకాండలు చేసాడు. భార్యని కోల్పోయినబాధలో ఉన్న జయరాంకి ఓదార్పు మాటలు చెప్తూ, ఆయనకి సపర్యలు చేసాడు.

ఆ సందర్భంలోనే తన ముప్పై నాలుగో ఏట తల్లితండ్రులని చూసాడు. జయరాం పిలిచి పరిచయం చేసాడు.

"ప్రమూ మీ పేరెంట్స్ వచ్చారు."

ప్రమోద్ వాళ్ళవంక నిశితంగా చూసాడు. చిన్నప్పటి వాళ్ళ రూపం అతని మనోఫలకం మీద లేదు. వృద్ధాప్యపు తొలి అడుగులో ఉన్న వీళ్ళు అతనికి అపరిచితుల్లా తోచారు.

"ప్రస్సూ ఎలా ఉన్నావు?" ఆవిడ ఆదరంగా అడుగుతూ చెయ్యి పట్టుకుంది. తలాడించి, చెయ్యి విడిపించుకుని అక్కడినించి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత రెండు మూడుసార్లు వాళ్ళు తమ ఇంట్లో కనపడడంతో జయరాంకి చెప్పాడు.

"మామ్ ఉన్నంతకాలం ఎలా డిస్టెన్స్ మెయిన్‌టైన్ చేసారో అలాగే ఉండమని చెప్పండి డేడ్ వాళ్ళు మనింటికి రావడం నాకిష్టంలేదు"

దత్తతకి వచ్చాక ప్రమోద్ మొదటిసారిగా తన అయిష్టాన్ని వ్యక్తం చేసాడు.

తర్వాత వాళ్ళు రాలేదు.

జయరాం పోయినప్పుడు విషయం తెలియచేయలేదు. మూడునెలల తర్వాత తెలిసి పరామర్శకి వచ్చారు. ప్రమోద్ వాళ్ళతో మాట్లాడలేదు. వాళ్ళు నీరజతో కబుర్లు చెప్పి మనవడితో కొద్దిసేపు ఆడుకుని వెళ్ళిపోయారు.

డుంబుకి ఇదే ఊరికి ట్రాన్స్‌ఫర్ అవడంతో అతన్ని తీసుకుని వచ్చారు. జయరాం పోలికలతోనే ఉన్న డుంబు తమ్ముడి మీద ఆప్యాయంగా చెయ్యివేసి చెప్పాడు.

"ఏ ఫంక్షన్, పండగ, పుట్టినరోజు ఎప్పుడైనా సరే. నువ్వు లేని లోటు తెలిసేదిరా. ఎంత కొట్టుకున్నా నువ్వు నా బ్రదర్‌వేగా."

ప్రమోద్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నిన్నెందుకు ఇచ్చేసారని అమ్మా నాన్నలని పోట్లాడే వయసుకాదు నాది కూడా. రోజూ స్కూల్లో నిన్ను చూసి ఆనందపడేవాడిని. నువ్వు స్కూల్ మానేసి ఊరు వదిలి వెళ్ళాక పిచ్చెక్కినట్లయింది నాకు. దాంతో చిన్నూతో బాగా ఆడేవాడ్ని. వాడిప్పుడు సింగపూర్‌లో ఉంటున్నాడు. వాడికి నువ్వు గుర్తులేవు. స్నేహధర్మం అనుకుని నాన్న, ఏదో త్యాగం చేస్తున్నానని అమ్మ నిన్ను అలా అడాప్షన్‌కి ఇచ్చేయడం నాకూ నచ్చలేదు. బట్. వాళ్ళు పెద్దవాళ్ళయ్యారు. మళ్ళీ మనందరం కలిసి మెలిసి ఉండాలనుకుంటున్నారు. క్షమించెయ్‌రా"

ప్రమోద్ ఏమీ మాట్లాడలేదు. కొద్దిసేపుండి వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ తర్వాత తల్లి తండ్రులు అప్పుడప్పుడూ రావడం, తన పిల్లలతో ఆడుకోవడం, ఒకటి రెండు రోజులుండి వెళ్ళిపోవడం - అతనికి బావున్నట్లూ ఉంది. బాలేనట్లూ ఉంది.

"మా మరదలు మంచి డీల్ ఇచ్చింది గురూ."

ఆ మధ్యాహ్నం లంచ్ అవర్‌లో సుధాకర్ చెప్పాడు.

"మరదలు డీల్ ఇచ్చిందా?" ఓ కొలీగ్ ఈల వేసాడు.

"నీకెప్పుడూ అదే ఆలోచన" సుధాకర్ విసుక్కున్నాడు.

"మరి కొత్తాలోచన ఏంటో చెప్పు" కొలీగ్ అడిగాడు.

"వాళ్ళకి పిల్లలు లేరు. ఆయనలో ఏదో లోపమని, పుట్టరని డాక్టర్లు చెప్పారట.." ఫోన్‌లో ఏదో పుస్తకం చదువుకుంటున్న ప్రమోద్ ఆ మాటలు వినగానే వారి దగ్గరకి వెళ్ళి కూర్చున్నాడు.

"అంటే, పిల్లలు పుట్టడానికి నీ సాయం అడిగిందా?" కొలీగ్ కన్ను గీటి అడిగాడు.

"నన్ను చెప్పనివ్వవా? నీ ఊహలు ఆపితే నేను విషయంలోకి వస్తాను." సుధాకర్ కోప్పడ్డాడు.

"సరే చెప్పు."

"వాళ్ళత్తగారు ఎవరినైనా పెంచుకోమంటున్నారట. తనకి అనాథ పిల్లల్ని పెంచుకోవడం ఇష్టంలేదుట. వాళ్ళక్కని, అంటే నా వైఫ్‌ని ఒక బిడ్డని కనివ్వమని, ఆడైనా, మగైనా పుట్టగానే తను తీసుకుని పెంచుకుంటానని బర్త్ సర్టిఫికెట్‌లో కూడా తమ పేర్లే పేరెంట్స్‌గా రాసుకుంటానని రిక్వెస్ట్ చేసిందిట."

"దానికి నువ్వేమన్నావ్?" ప్రమోద్ ఆత్రంగా అడిగాడు.

"నాకు ఆల్ రెడీ ఇద్దరు పిల్లలు. ఇంక చాలు అనుకున్నాం కూడా. ఇప్పుడు మళ్ళీ ప్రెగ్నెన్సీ, డెలివరీ అంటే ఇబ్బందే ఆ మాటే చెపితే, మా మరదలు ఒకటే ఏడుపు. నిన్న నా తోడల్లుడితో వచ్చింది. ఆయన కూడా బతిమాలాడు. బిడ్డ పుట్టగానే ఊళ్ళోని పదెకరాల పొలాన్ని వాడి పేరున రాస్తానని ప్రామిస్ చేసాడు"

ప్రమోద్ లేచి సుధాకర్ రెండు చేతులూ గట్టిగా పట్టుకుని చెప్పాడు.

"ప్లీజ్ సుధా. ఒప్పుకోకు. ఓ చోటనించి మొక్కని పీకి ఇంకో చోట నాటడం కాదు అడాప్షన్ అంటే. ఆ పసికందు పెద్దయ్యాక ఎంత బాధ పడతాడో అర్థం చేసుకో. కుటుంబంలోనే అంటే వాడికి డెఫినెట్‌గా తెలుస్తుంది మీ కొడుకునే అని. తర్వాత వాడు అక్కడా ఇమడలేడు, ఇక్కడా ఇమడ లేడు. త్రిశంకు స్వర్గంలో వేలాడతాడు. లోకంలో ఎంతమంది అనాథలు లేరు చెప్పు? మీ మరదలుని కొంచెం సహృదయంతో ఆలోచించి ఒక అనాథకి జీవితాన్నివ్వమని చెప్పు."

"నువ్వెందుకింత ఆవేశ పడుతున్నా వ్?" సుధాకర్ విస్మయంగా అడిగాడు.

"అయాం సారీ.. నేనూ అలాంటి త్రిశంకువునే."

ప్రమోద్ అక్కడినించి లేచి వెళ్ళిపోయాడు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments